నల్లమల ఆలయాలాభివృద్ధికి కృషి

- టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం : మంత్రి కొండాసురేఖ

మాట్లాడుతున్న అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

అచ్చంపేట రూరల్/టౌన్, అక్టోబర్ 7 : నల్లమలలో ఉన్న ఆలయాలను అభివృద్ధి చేసి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. త్వరలో ఇందుకు సంబంధించి శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి అంచనాలను తయారు చేసే ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. సోమవారం ఉమామహేశ్వర క్షేత్రంలో ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా బీరం మాధవ రెడ్డిచే ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఉమ్మడి జిల్లా ఎండో మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి సమక్షంలో మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ఖజానాపై ఆర్థిక భారం పడుతుందని, ఎన్నికలలో ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేసేందుకు అష్టక ష్టాలు పడుతున్నామన్నారు. అన్ని సంక్షేమ పథకాలను ఒకేసారి అమలు చేయడం దేవుడికి కూడా సాధ్యం కాదు.. ప్రజలు తమకు ఐదేండ్లు అవకాశం కల్పించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం దశల వారీగా సంక్షేమం, అభివృద్ధి పథకాలను అమలు చేస్తామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కూడా కాలేదని, అప్పుడే సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలను మానుకోవాలన్నారు. పాలక మండలి కార్యవర్గం సమర్థవంతంగా పనిచేసి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అంతకుముందు ఉమామహేశ్వర, అచ్చంపేట భక్త మార్కండేయ ఆలయాల్లో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలతో కలిసి బతుకమ్మ పాటలకు ఆడిపాడారు. మేదరుల అభివృద్ధికి సహకరిస్తామని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం ఉమామహేశ్వర క్షేత్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమెకు జిల్లా మేదరుల సంఘం నుంచి వినతిపత్రాన్ని అందజేశారు. మేదరులకు వెదురుని ఉచితంగా అందించి, సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లా కేంద్రంలో వెదురు శిక్షణా కేంద్రాన్ని నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె సానుకూలంగా స్పందించి మేదరులను ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, సాట్స్ చైర్మన్ శివ సేనారెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేందర్‌రెడ్డి, మద్దిమడుగు ఆలయ చైర్మన్ రాములునాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత, ఆలయ పాలకమండలి డైరెక్టర్లు, నాయకులు రమాకాంత్, కొండలయ్య, తిరుపతయ్య, రాజు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్ : ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 7 : అర్జీదారుల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు యూసూఫ్ అలీ, మునీరోద్దీన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి

కల్వకుర్తి, అక్టోబర్ 7 : డబుల్ బెడ్రూం ఇండ్లలో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులకు ఆదేశించారు. కల్వకుర్తి పట్టణంలోని నిర్మించిన 240 డబుల్ బెడ్రూం ఇండ్లను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. ఇండ్ల నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో మౌలిక వసతులను పూర్తి చేసి పంపిణీకి సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. అక్కడికి వచ్చిన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు తదితర అవసరాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనుతో మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

ఫిర్యాదురాలతో మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 7 : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 9 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల పోలీస్ అధికారులను ఆదేశించారు. న్యాయం చేయాలంటూ మూడు ఫిర్యాదులు, భూమి పంచాయితీలకు ఐదు ఫిర్యాదులు, భార్య భర్తల పంచాయితీకి ఒక ఫిర్యాదు అందాయి.

మత్స్యకారుల అభివృద్ధికి నిరంతరం కృషి

బిజినేపల్లి : పాలెం చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్సీ

బిజినేపల్లి, అక్టోబర్ 7 : మత్స్యకారుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పాలెం గ్రామ పెంటోని చెరువులో మత్స్యకారులతో కలిసి చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందేందుకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో బాల స్వామి, నాగరాజు, యాదగిరి, రాములు, మల్లేశ్, లోకేశ్, శ్రీను, కాశన్న, అధికారులు తదితరులు ఉన్నారు.

చేప పిల్లలను వదులుతున్న జిల్లా మత్స్య శాఖ అధికారి రజిని

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 7 : జిల్లా కేంద్రంలోని 9 జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపై కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. రూ. 23లక్షల వ్యయంతో నిర్మించే నూతన కల్వర్టు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బాబురావు, కౌన్సిలర్లు జక్కా రాజేకుమార్‌రెడ్డి, సునీంద్ర, నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి సముద్రంలో..

కొల్లాపూర్, అక్టోబర్ 7 : కొల్లాపూర్ మండలం సింగోటం శ్రీవారి సముద్రంలో సోమవారం జిల్లా మత్స్య శాఖ అధికారిణి రజిని ఆధ్వర్యంలో లక్ష చేపల సీడ్‌ను వదిలారు. కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్య సంపదను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. చెరువులు, రిజర్వాయర్లు, కుంటల్లో చేపల సీడ్‌ను వదలడం జరుగుతోందన్నారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం వదిలిన చేపల సీడ్ కంటే ఈసారి తక్కువగా వదలడం జరుగుతోందని మత్స్యకార్మికులు ఆరోపిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటస్వామి, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, మత్స్యశాఖ సింగోటం సొసైటీ నాయకులు పాల్గొన్నారు.

అవినీతి కేసును ఏసీబీకి అప్పగించాలి

- కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన బీఎస్పీ నేతలు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 7 : నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో జరిగిన అవినీతి ఆరోపణల కేసును ఏసీబీకి అప్పగించాలని బీఎస్పీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో కోటి రూపాయల అవినీతి ఆరోపణలు రావడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం, నిత్యం పనిచేసే జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల్లో పరిపాలన పరిస్థితి ఊహించుకుంటేనే భయంగా ఉందన్నారు. మున్సిపాలిటీలో జరిగిన అవినీతిని బయటపెట్టేందుకు విచారణకోసం ఏసీబీకి అప్పగించాలని కోరారు. ఈ విషయంలో అధికారులను రక్షించేందుకు ప్రయత్నిస్తే మున్సిపల్ కార్యాలయాన్ని బీఎస్పీ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కళ్యాణ్, రాంచందర్, నాగేశ్, నాగరాజు, శేరి నాగరాజు, రామకృష్ణ, సాయిబాబు పాల్గొన్నారు.

భూ సమస్యలపై..

వెల్దండ, అక్టోబర్ 7 : మండలంలో నెలకొన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎంపీటీసీ మోతీలాల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం వెల్దండ తాసీల్దార్ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ సంతోష్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. చాలా గ్రామాల్లో భూ సమస్యలు చాలా ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, కొన్ని చోట్ల అన్యాక్రాంతమవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, శ్రీనుయాదవ్, పుల్లయ్య ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఎంపీడీవో ఆంజనేయులుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న కార్మికులు

లింగాల, అక్టోబర్ 7 : మండలంలోని ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికులకు ఆరు నెలలుగా బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. నిత్యావసర సరుకుల రేట్లు పెరగడంతో అప్పులు చేసి వంట వండి విద్యార్థులకు సకాలంలో భోజనం పెడుతున్నట్లు తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే దసరా సెలవులు అనంతరం మధ్యాహ్న భోజన విరమించి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో ఆంజనేయులుకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్, కార్మికులు రాములమ్మ, అచ్చమ్మ, మంగమ్మ, లలిత, రేణుక, రామచంద్రమ్మ, కలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

- కలెక్టర్ ఏవో చంద్రశేఖర్‌కు లబ్ధిదారుల వినతి

చారకొండ, అక్టోబర్ 7: మండలంలో రెండో విడత దళితబంధుకు ఎంపికైన లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని జేపల్లి, గోకారం గ్రామానికి చెందిన లబ్ధిదారులు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఏవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు శంకర్, రమేశ్ మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వ హయంలో దళితుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన దళితబంధు పథకంలో చారకొండ మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ప్రతి కుటుంబానికి పది లక్షలు అందించారని చెప్పారు. అదేవిధంగా రెండో విడుత మండలంలో 279 మంది ఎంపికైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అనేక హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్న ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. దళితబంధు నిధులు మంజూరు చేసి దళితులను ఆదుకోవాలని కోరారు.

దళితబంధు నిధులు మంజూరు చేయకుంటే లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెండో విడుత ఎంపికైన లబ్ధిదారులు మల్లేశ్, నిరంజన్, వెంకట్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని సన్మానించిన వెంకట్‌రెడ్డి

ఎస్సైని సన్మానిస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

చారకొండ, అక్టోబర్ 7: ఇటీవల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్‌రెడ్డికి సోమవారం ధర్మ సమాజ్ పార్టీ మండలాధ్యక్షుడు చారకొండ చంద్రశేఖర్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నాగార్జున, మల్లేశ్, తానేశ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు..

కల్వకుర్తి, అక్టోబర్ 7 : క్లాస్‌మెట్ క్లబ్ కల్వకుర్తి డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వాసవీక్లబ్ సభ్యులు ఉపాధ్యాయులకు మెమోంటోలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఏంఈవో శంకర్, ఝాన్సీ, రాజేంద్ర ప్రసాద్, బాలు పాల్గొన్నారు.

పత్తి పంటకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

పత్తిపంటకు ఆశించే తెగుళ్లను పరిశీలిస్తున్న ఏఈవో వంశీ

చారకొండ, అక్టోబర్ 7 : పత్తిపంటకు ఆశించే తెగుళ్లపై సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏఈవో వంశీ అన్నారు. సోమవారం మండలంలోని అగ్రహారంతండా, సిరుసనగండ్ల, రామచంద్రాపురం శివారులో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో ప్రస్తుతం పత్తిపంటకు లద్దె పురుగు ఆశిస్తుందని చెప్పారు. వాటి నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ లేదా ఫ్లిదొర, క్లోరంతినిలిప్రోల్ పిచికారీ చేయాలని సూచించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

డీడబ్ల్యూవోకు వినతిపత్రం అందజేస్తున్న రాజశేఖర్

అచ్చంపేట టౌన్, అక్టోబర్ 7 : దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని డబ్ల్యూవో రాజేశ్వరికి సోమవారం జిల్లా కార్యాలయంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల విభాగంలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. 2016 చట్టం జీవో ప్రకారం ప్రతి మూడునెలల కు ఒక సారి డీడబ్ల్యూవో జిల్లాఅధికారి, కలెక్టర్ ఆధ్వర్యంలో దివ్యాంగుల కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు విజిలెన్స్ మానిటరింగ్ మీటింగ్ ఏర్పాటు జరిగేది కాని 14 నెలలు అవుతున్నా మీటింగ్ జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కమిటీ మీటింగ్ ఏర్పాటు, దివ్యాంగుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

అభిరామ్ (ఫైల్)

లింగాల, అక్టోబర్ 7 : విద్యుదాఘాతానికి గురై బాలుడు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకున్నది. కుటుంబసభ్యులు తెలిపిన కథనం ప్రకారం లింగాలకు చెందిన రామావత్ అశోక్, శిరీషా దంపతుల కుమారుడైన రామావత్ అభిరామ్ (11నెలలు) ఇంట్లో ఆడుకుంటు స్విచ్‌బోర్డులో వేలు పెట్టగా విద్యుత్ షాక్ తగిలి స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన తల్లి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక దవాఖానకు తరలించి అక్కడి నుంచి నాగర్‌కర్నూల్ ఏరియా దవాఖానకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడి మృతితో కుటుంబసభ్యుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

ఉపాధిహామీ పనులపై ప్రణాళికలు సిద్ధం

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 7 : 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ పథకంలో కూలీలకు కల్పించే వంద రోజులపై ప్రణాళికలను సిద్ధం చేసినట్లు ఎంపీడీవో మధుసూదన్‌గౌడ్ తెలిపారు. అచ్చంపేట, ఉప్పునుంతల, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాల్‌లో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్లానింగ్ చేసే సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఉప్పునుంతల ఎంపీడీవో మోహన్‌లాల్, ఏపీవో సుదర్శన్, శిక్షకులు వెంకటయ్య, ఈసీలు రవిరాజ్, రేణయ్య, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సిబ్బందికి శిక్షణ

వంగూరులో ఉపాధి సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

వంగూరు, అక్టోబర్ 7: మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం వంగూరు, చారకొండ మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి ఉపాధిహామీ ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా లేబర్ బడ్జెట్ పనుల గుర్తింపు ఏలా చేయాలని అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు విజయభాస్కర్, ఇసాక్ హుస్సేన్, ఏపీవోలు శివశంకర్ గౌడ్ లక్ష్మయ్య, ఈసీ కిషన్‌తో పాటు ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కల్వకుర్తి రూరల్/తాడూరు, అక్టోబర్ 7 : కల్వకుర్తి పట్టణానికి గాయాల బాలయ్య ఆదివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కల్వకుర్తి పట్టణాధ్యక్షుడు బావండ్ల మధు సోమవారం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం వారికి రూ.15వేలు అందజేశారు. అదేవిధంగా కల్వకుర్తి మండలం జిళ్లెల్ల గ్రామంలో సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన బాలమ్మ కుటుంబసభ్యులను ఆ గ్రామ మాజీ సర్పంచ్ రాములు పరామర్శించి రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే తాడూరు మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ (48) ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుడి స్నేహితులు యారా రమేశ్, గౌస్‌పాషా, పర్వతాలు, బాలేమియా, పదోతరగతికి చెందిన స్నేహితులు రూ.20వేల ఆర్థిక సాయాన్ని మృతుడి భార్య విజయలక్ష్మికి అందజేశారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మానవత్వం చాటిన ఎస్సై

గాయపడిన వ్యక్తిని అంబులెన్స్ ఎక్కిస్తున్న ఎస్సై జగన్‌మోహన్

లింగాల, అక్టోబర్ 7 : రోడ్డు ప్రమాదంలో రక్తపుమడుగులో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ఎస్సై దవాఖానకు తరలించి మానవత్వం చాటుకున్న ఘటన మండలంలో చోటు చేసుకున్నది. సోమవారం మండలంలోని రామాపురం స్టేజీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్ అదుపుతప్పి కిందపడి రక్తపు మడుగులో ఉన్నాడు. దీంతో అచ్చంపేట నుంచి లింగాల వైపు వస్తున్న ఎస్సై జగన్‌మోహన్ తక్షణమే స్పందించి అంబులెన్స్‌కు కాల్ చేసి స్వయంగా తనతో పాటు హోంగార్డు హుస్సేన్ అంబులెన్స్‌లో ఎక్కించి అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అదేవిధంగా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరినట్లు తెలిపారు. దీంతో పలువురు ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మంత్రి తుమ్మల పర్యటన

బల్మూరు, అక్టోబర్ 7 : నేడు మండలంలోని రైతు గోదాంలను ప్రారంభించేందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొంటారని పీఏసీసీఎస్ సీఈవో రాజవర్ధన్‌రెడ్డి, చైర్మన్ నర్సయ్య, వెంకటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండనాగుల, బల్మూరు, తుమ్మెన్‌పేటలో ఉదయం 11గంటలకు మంత్రిచే గోదాం ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీలు దామోదర్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. కావున మండలంలోని రైతులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

లలితాదేవి అలంకరణలో వాసవీమాత

- దుర్గామాతలకు ప్రత్యేక పూజలు

అమ్రాబాద్ : మహాకాళీదేవికి పూజలు చేస్తున్న అమ్మవారి దీక్ష స్వాములు



బిజినేపల్లి : దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో, ఆలయాల్లో మండపాలను ఏర్పాటు చేసి అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. సోమవారం వివిధ అలంకరణలో అమ్మవారికి భక్తులు పూజలు చేస్తున్నారు. కొన్ని మండపాల వద్ద అమ్మవారిని మహాకాళీదేవి అలంకరణలో పూజించారు. అనంతరం మహిళలు కుంకుమార్చన, భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మండపాల వద్ద బతుకమ్మ సంబురాలు జరుపుకొన్నారు. మహిళలు, యువతులు కోలాటం వేసి ఆడిపాడారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, అక్టోబర్ 7

నాగర్‌కర్నూల్ : భజరంగ్‌దళ్ యూత్ ఆధ్వర్యంలో పూజలు చేస్తున్న మహిళలు

అచ్చంపేటటౌన్ : అచ్చంపేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో లలితాదేవీగా అమ్మవారు

సీసీ కెమెరాల పరిశీలన

సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్సై సతీశ్

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 7 : మండలంలోని సాతాపూర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్సై సతీశ్ సోమవారం పరిశీలించారు. గ్రామంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ముఖ్య కూడలిలో సీసీ కెమెరాలు గ్రామ నాయకులు ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామన్నారు. ఇటీవల గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిని గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.